# సీఎం కేసీఆర్ సార్‌కే మా మద్దతు

- భూనిర్వాసిత గ్రామం మామిడ్యాల వాసుల తీర్మానం
- సీఎం కేసీఆర్‌కు తీర్మాన పత్రాన్ని అందజేసిన ఏఎంసీ చైర్మన్ జహంగీర్


సీఎం కేసీఆర్‌కు తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ జహంగీర్

ములుగు, నవంబర్ 13 : తామంతా సీఎం కేసీఆర్ వెంటే ఉంటామని భూనిర్వాసిత గ్రామం మామిడ్యాల వాసులు ఏకగ్రీవ తీర్మానం చేసి ఏఎంసీ చైర్మన్ జహంగీర్‌కి అందజేశారు. సోమవారం ముఖ్యమంత్రి వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌కు ఏఎంసీ చైర్మన్ తీర్మాన పత్రాన్ని అందజేశారు. మండలంలోని మామిడ్యాలలో ఏఎంసీ చైర్మన్ జహంగీర్, డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్ఎస్ యూత్ వింగ్ ఉపాధ్యక్షుడు జుబేర్‌పాషా ఆధ్వర్యంలో వివిధ కులసంఘాల నేతలు అసెంబ్లీ ఎన్నికల్లో తమ పూర్తి మద్దతు బీఆర్ఎస్‌కే తెలుపుతామంటూ ఏకగ్రీవ తీర్మానాలను చేసి జహంగీర్, అంజిరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ గతంలో భూనిర్వాసితులంటే చాలీచాలని, అందీ అందని నష్టపరిహారం.. చెట్టుకొకరు.. పుట్టకొకరుగా.. విడిపోయిన బతుకులు.. ఇప్పటికీ నష్టపరిహారం అందక కోర్టుల చుట్టూ వందలాది కుటుంబాలు తిరుగుతున్నాయని తెలిపారు. భూములు కోల్పోయిన నిర్వాసితులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. దేశానికే ఆదర్శంగా చక్కని గృహ సముదాయాన్ని నిర్మించి ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం అందించిందని తెలిపారు. పరిశ్రమలను ఏర్పాటు చేసి కాలనీవాసులకు ప్రత్యేక శిక్షణను అందించి వారి జీవితాలకు నిండు భరోసాను కల్పించిందన్నారు. న్యాయమైన నష్టపరిహారాన్ని అందించి భూనిర్వాసితుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపిందన్నారు. అందుకే తమ మద్దతు కేసీఆర్‌కే అంటూ గ్రామస్తులంతా ఏకగ్రీవ తీర్మానాలను అందజేశారు.

# తుది ఓటరు జాబితా విడుదల

- జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 9,48,669
- మహిళా ఓటర్లు 4,80,166 పురుష ఓటర్లు 4,68,422



సిద్దిపేట అర్బన్, నవంబర్ 13 : జిల్లాలో తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. జిల్లాలో మొత్తం 9,48,669 మంది ఓటర్లు ఉండగా, ఇందులో మహిళా ఓటర్లు 4,80,166 మంది ఉండగా, పురుష ఓటర్లు 4,68,422 మంది ఉన్నారు. ఇందులో జిల్లాలో హుస్నాబాద్ (32) నియోజకవర్గంలో 2,42,182 మంది ఓటర్లు ఉండగా, ఇందులో మహిళలు 1,22,415 మంది ఉండగా, పురుషులు 1,19,763 మంది, ఇతరులు నలుగురు ఉన్నారు. సిద్దిపేట(33) నియోజకవర్గంలో మొత్తం 2,33,733 మంది ఓటర్లు ఉండగా.. మహిళలు 1,18,317 మంది ఉండగా.. పురుషులు 1,15,346 మంది, ఇతరులు 70 మంది ఉన్నారు. దుబ్బాక (41) నియోజకవర్గంలో మొత్తం 1,98,100 మంది ఓటర్లు ఉండగా.. మహిళలు 1,01,081 మంది ఉండగా.. పురుషులు 97,019 మంది ఉన్నారు. గజ్వేల్ (42) నియోజకవర్గంలో మొత్తం 2,74,654 మంది ఉండగా.. ఇందులో మహిళలు 1,38,353 మంది ఉండగా.. పురుషులు 1,36,294 మంది ఉండగా.. ఇతరులు 7 మంది ఉన్నారు.

సిద్దిపేట జిల్లా తుది ఓటరు జాబితా..

| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| హుస్నాబాద్ | 1,19,763 | 1,22,415 | 4 | 2,42,182 |
| సిద్దిపేట | 1,15,346 | 1,18,317 | 70 | 2,33,733 |
| దుబ్బాక | 97,019 | 1,01,081 | 0 | 1,98,100 |
| గజ్వేల్ | 1,36,294 | 1,38,353 | 7 | 2,74,654 |
| మొత్తం | 4,68,422 | 4,80,166 | 81 | 9,48,669 |


ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు


బెజ్జంకి : ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు

# బీఆర్ఎస్‌లో చేరికల జోరు

గజ్వేల్, నవంబర్ 13 : మండలంలోని మక్తమాసన్‌పల్లిలో వివిధ పార్టీలకు చెందిన మహిళలు, యువకులు ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే రసమయి సమక్షంలో చేరికలు

బెజ్జంకి, నవంబర్ 13: మండల కేంద్రంతో పాటు, లక్ష్మీపూర్, ముత్తన్నపేట, రేగులపల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీల నుంచి భారీ సంఖ్యలో రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బోనగిరి తిరుపతిని మండల ఉపాధ్యక్షుడిగా, బోనగిరి మహేశ్‌ను పార్టీ మండల కార్యదర్శి నియమిస్తూ నియామకం పత్రం అందజేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఎమ్మెల్యే రసమయికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కోహెడలో ఇంద్రనీల్ ప్రచారం

కోహెడ, నవంబర్ 13 : మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం హుస్నాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్‌కు ఓటు వేసి గెలిపించాలని ఆయన తనయుడు వొడితెల ఇంద్రనీల్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పలు దుకాణాలను తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పేర్యాల రాజేశ్వర్‌రావు, యువత నాయకులు జాలిగాం శంకర్, నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరికలు

మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన యాదవ సంఘం నాయకులు సోమవారం హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో యాదవ సంఘం నాయకులు బీనవేని శ్రీకాంత్, బీనవేని రామస్వామిలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# నామినేషన్ల తిరస్కరణ

- సిద్దిపేటలో రెండు..
- 39నామినేషన్లకు 37 ఆమోదం

సిద్దిపేట, నవంబర్ 13 : సిద్దిపేట అసెంబ్లీ స్థానానికి 39 మంది అభ్యర్థులు 76 నామినేషన్లు దాఖలు చేయగా, సోమవారం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి రమేశ్‌బాబు ఆధ్వర్యంలో నామినేషన్ల (స్క్రూట్నీ) పరిశీలన ముగిసింది. ఈ స్క్రూట్నీలో రెండు నామినేషన్లు తిరస్కరించినట్లు అధికారలు తెలిపారు. మొత్తం 37 మంది అభ్యర్థులు నామినేషన్లు సరిగా ఉన్నట్లు ధ్రువీకరించి ఆమోదించామన్నారు. బైరి నాగరమణ నామినేషన్ పత్రంతో జతపర్చిన అఫిడవిట్‌లో పూర్తిస్థాయిలో వివరాలు నమోదు చేయనందున నామినేషన్ తిరస్కరణకు గురైనట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు.

### దుబ్బాకలో 7 నామినేషన్లు తిరష్కరణ

#### పోటీలో 15 మంది అభ్యర్థులు

దుబ్బాక, నవంబర్ 13 : దుబ్బాక శాసనసభకు పోటీ చేసేందుకు 22 మంది అభ్యర్థులకు మొత్తం 38 నామినేషన్ సెట్‌లు సమర్పించారు. సోమవారం నామినేషన్ల స్క్రూట్నీని (పరిశీలన)లో 7 (ఏడుగురు) అభ్యర్థుల నామినేషన్లు తిరష్కరణకు గురయ్యాయని రిటర్నింగ్ అధికారి గరిమా అగర్వాల్ తెలిపారు. తిరష్కరణకు గురైన అభ్యర్థుల్లో ఇండియా ప్రజాబంధు పార్టీ గుండుకాడి కరుణాకర్, భారత చైతన్య యువ జన పార్టీ ఎల్లా శ్రీనివాస్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థులు జక్కుల నర్సింహులు, దండ్ల నరేశ్, సల్కాం రేణుక, చెరుకు విజయలక్ష్మి, మాధవరెడ్డిగారి హనుమంతరెడ్డి నామినేషన్లు తిరష్కరణకు గురయ్యాయని తెలిపారు. ప్రస్తుతం దుబ్బాక బరిలో 15 మంది అభ్యర్థులు పోటీలో నిలిచేందుకు వారి నామినేషన్లను దుబ్బాక ఆర్వో గరిమా అగర్వాల్ ధ్రువీకరించారు.

### హుస్నాబాద్‌లో రెండు..

#### -34 నామినేషన్లు ఆమోదించిన అధికారులు

హుస్నాబాద్, నవంబర్ 13 : హుస్నాబాద్ అసెంబ్లీ ఎన్నికలకు ఇటీవల దాఖలైన నామినేషన్లలో రెండు నామినేషన్లను తిరస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి బెన్ షాలోమ్ తెలిపారు. సోమవారం నామినేషన్ల పరిశీలన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఈ నెల 10 వరకు మొత్తం 36మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేయగా, ఇందులో ఇండిపెండెంట్ అభ్యర్థులు కొత్తకొండ నాగరాజు, అంగేటి సంపత్‌రెడ్డి నామినేషన్లు నిబంధనల ప్రకారం లేకపోవడంతో తిరస్కరించామని ఆయన తెలిపారు. ప్రస్తుతం 34మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించామని చెప్పారు.

### 13 నామినేషన్లు తిరస్కరణ

గజ్వేల్, నవంబర్ 13: గజ్వేల్ అసెంబ్లీ స్థానానికి 127మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలను ఈ నెల 10వరకు దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నామినేషన్ పత్రాలను స్క్రూట్నీ చేయగా, అందులో 13 తిరస్కరణకు గురయ్యాయి. 127మంది నామినేషన్లు దాఖలు చేయగా, తిరస్కరణ తర్వాత 114 మంది నామినేషన్లను రిటర్నింగ్ అధికారి బన్సీలాల్ ఆమోదించారు.


దుబ్బాక రిటర్నింగ్ కార్యాలయంలో నామిషన్లను పరిశీలిస్తున్న ఆర్వో గరిమా అగర్వాల్

# ‘పల్లా’కే మా మద్దతు


- లద్నూర్ గౌడ సంఘం తీర్మానం
- పల్లా రాజేశ్వర్‌రెడ్డికి తీర్మాన పత్రం అందజేత

మద్దూరు (ధూళిమిట్ట), నవంబర్13 : మద్దూరు మండలంలోని లద్నూర్ గ్రామానికి చెందిన గౌడ సంఘం బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డికే మద్దతునిస్తామని ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ మేరకు ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తీర్మాన పత్రాన్ని సోమవారం పల్లాకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వంగ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు గుజ్జుక సమ్మయ్య, నర్సింహులు, ధూళిమిట్ట మండల బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు ఇమ్మడి సంజీవరెడ్డి, బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి పాకాల కిరణ్‌కుమార్, నాయకులు భాస్కర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరిన కొత్త దొమ్మాట కాంగ్రెస్ నాయకులు

చేర్యాల, నవంబర్ 13 : రాష్ట్రంలోని అన్నివర్గాల పేదలకు గులాబీ జెండా అండగా ఉందని, కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాలు నమ్మితే అభివృద్ధి కుంటుపడుతుందని జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండంలోని కొత్త దొమ్మాట గ్రామానికి చెందిన కాంగ్రెస్ వార్డు సభ్యుడు కొలిపాక శ్రీనివాస్, నాయకులు తిరుపతి, అంజయ్య, కొలిపాక వెంకటేశ్, కొలిపాక ఆంజనేయులు, బస్వరాజు కరుణాకర్, కొమ్మరాజుల బాబుతోపాటు 50మంది కార్యకర్తలు సర్పంచ్ భిక్షపతి, ఉపసర్పంచ్ బాబు, భాస్కర్, తాండ్ర సాగర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో జనగామలో జరిగిన కార్యక్రమంలో సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


పల్లాకు తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న లద్నూర్ గౌడ సంఘం నాయకులు


కాంగ్రెస్ నాయకులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పల్లా